ఇసుక లేక..ఇళ్లు కట్టలేక

- ఇసుక కోసం సామాన్యుల అవస్థలు
- అడ్డదారుల్లో పెన్నా, హగరి నుంచి తరలింపు
- రూ.కోట్లు దండుకుంటున్న టీడీపీ నేతలు


ఉరవకొండలో ఇసుక కొరతతో ఆగిపోయిన ఇంటి నిర్మాణం


కూడేరులో ఇసుక కొరతతో రెండు నెలల నుంచి ఆగిన నిర్మాణం

ఉరవకొండ: ఇసుక దొరక్క ఇళ్లు కట్టలేక సామాన్యులు అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి మూడు నెలలు పూర్తయ్యింది. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఉచిత ఇసుక అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఇసుక అందడం అటుంచితే పేద, సామాన్య ప్రజలు రూ.వేలు వెచ్చించినా దొరకడంలేదు. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలకు కూడా ఇసుక లేక ఎక్కడిక్కడే ఆగిపోయాయి. కొందరు కొత్తగా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేందుకు సాహసం చేయడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుకకు సంబంధించి శాశ్వత విధానాన్ని ఇప్పటివరకూ అమలు చేయలేదు. నూతన ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకోవాలంటే అవస్థలు తప్పడం లేదు. ఇసుక కావాల్సిన చోట అందుబాటులో ఉండటం లేదు. ఆన్‌లైన్‌లో ఇసుక నిల్వలు లేవని చూపుతుండటంతో ఇసుక బుకింగ్‌కు సమస్యలు తలెత్తుతున్నాయి. అయినప్పటికీ టీడీపీ నేతలు అడ్డదారుల్లో ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఓ వైపు ఇసుక లభించక పేదలు అవస్థలు పడుతుంటే.. మరోవైపు టీడీపీ నాయకులు, సానుభూతి పరులు, వారి బంధువులు అక్రమంగా తరలిస్తున్నారు. బెళుగుప్ప మండలం హగరి, పెన్నా నదీ నుంచి అర్ధరాత్రి పూట ట్రాక్టర్లతో పెద్ద ఎత్తున ఇసుకను తరలిస్తున్నారు. దీంతో పాటు కణేకల్లు మండలం మచ్చుమర్రి స్టాక్ పాయింట్ నుంచి కుడా ఇష్టారాజ్యంగా టీడీపీ నాయకులు తరలించడంతో స్టాక్ పాయింట్‌లో ఇసుక ఖాళీ అయ్యింది. టీడీపీ నేతలు అక్రమంగా తరలిస్తున్నా అధికారులు కనీస చర్యలు తీసుకోలేదు.

ఉపాధి కోల్పోతున్న భవన నిర్మాణ కార్మికులు

ఇసుక అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణ పనులు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. పూట గడవక కుటుంబ పోషణ భారమై పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకటి రెండు రోజులయితే కార్మికులు ఓపిక పట్టుకోగలరు. దాదాపు 3 నెలల నుంచి ఇసుక అందుబాటులో లేకపోవడంతో అప్పులు చేసి కుటుంబాన్ని పోషించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని పలువురు కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో బుక్ చేసినా అందలేదు



అప్పులు చేసి ఇంటి నిర్మాణం ప్రారంభించాం. ఇసుక కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినా నెలరోజులవుతున్నా అందలేదు. బయట రూ.5వేలు ఇస్తామన్నా ట్రాక్టర్ ఇసుక దొరకడం లేదు. కూటమి ప్రభుత్వం దీనిపై స్పందించి మా లాంటి సామాన్యులకు ఇసుక అందేలా చర్యలు తీసుకోవాలి.

– పాల ఈశ్వరయ్య, భవన నిర్మాణ దారుడు, కూడేరు

పనులు లేక అవస్థలు పడుతున్నాం



గత మూడు నెలలుగా ఇసుక అందుబాటులో ఉండటం లేదు ప్రభుత్వం నిర్మిస్తున్న ఇళ్ళకు ఇసుక అందడం గగనంగా మారింది. కేవలం పలుకుబడి ఉన్న వారికి మాత్రమే ఇసుక అందుతుంది. మూడు నెలలుగా పూర్తి స్థాయిలో పనులు దొరకడం లేదు. ఇలా అయితే కుటుంబ పోషణంగా భారంగా మారుతుంది.

– గోపాల్, భవన నిర్మాణ కార్మికుడు, ఉరవకొండ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

రాయదుర్గంటౌన్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తతతో ఉండాలని, వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం బీటీపీ లేఅవుట్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో స్వచ్ఛ రాయదుర్గం–స్వాస్థ్య రాయదుర్గం కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధులపై ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్యశాఖ చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. అనంతరం అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మీనరసమ్మ, ఆరోగ్య సిబ్బంది సరోజ, విజయలక్ష్మీ, శోభ, ప్రమీల, లలిత, సునీత, అరుణ పాల్గొన్నారు.

బెళుగుప్ప: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి ఓబుళు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని గంగవరం, బెళుగుప్ప గ్రామాల్లో వైద్యాధికారులు కార్తీక్ రెడ్డి, ప్రియాంక, జిల్లా ఉప మలేరియా అధికారి సత్యనారాయణతో కలిసి పర్యటించారు. బెళుగుప్పలో ఏర్పాటు చేసిన ఆశాడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ వెంకటరమణ, వసంత, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

పీహెచ్‌సీలో ఆశాడే

కూడేరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నాయని, కలుషిత నీటితో వ్యాధులు వస్తాయన్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. భోజనానికి ముందు చేతులను శుభ్రం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పారా మెడికల్ ఆఫీసర్ నాగన్న మాట్లాడుతు చర్మంపై స్పర్శ లేని మచ్చలుంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి, కుష్టు వ్యాధి నిర్ధారణ చేయించుకునేలా ప్రజలను చైతన్య పరచాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు రవీంద్ర, యశోద, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రంగయ్య పరామర్శ


గిరిప్రసాద్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

కంబదూరు: మండల కేంద్రానికి చెందిన మాజీ వలంటీర్ గిరిప్రసాద్ (38) అనారోగ్యంతో సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. కొద్ది రోజులుగా గిరిప్రసాద్ కేన్సర్‌తో బాధపడుతుండే వాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా ఫలితంలేకపోయింది. అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య మంగళవారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యంగా ఉండాలని, తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అదే మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మాహబూబ్‌సాబ్ కుటుంబాన్ని కూడా ఆయన పరామర్శించారు. ఇటీవల మహబూబ్ సాబ్ కుమార్తె అనారోగ్యంతో మృతి చెందింది. మాజీ ఎంపీ వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, మండల కన్వీనర్ బాలరాజు, జిల్లా కమిటీ సభ్యుడు నీలి శంకరప్ప, వైస్ ఎంపీపీ భీమేష్, సీనియర్ నాయకులు ఎంఎస్ రాయుడు, డాక్టర్ బొమ్మయ్య, డాక్టర్ వీరేంద్ర, చందన శివాజీ, విల్సన్, ఎంపీటీసీలు మీసేవ కుమార్, మల్లేష్, కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్, మైనార్టీ నాయకుడు దాదు, నాయకులు రామస్వామి, గోపి,రాజు, ఒంటారెడ్డిపల్లి హనుమంతరాయుడు, వెంకటేశులు పాల్గొన్నారు.

స్థలం కబ్జాపై ఫిర్యాదు


మున్సిపల్ గోడ పగలగొట్టి చదునుచేస్తున్న జేసీబీని అడ్డుకున్న అధికారులు

రాయదుర్గం: పట్టణంలోని శాంతినగర్‌లో వైఎస్సార్ విగ్రహం వెనుకనున్న రూ.కోటి విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఓ వ్యక్తి కబ్జాకు యత్నించారు. సర్వే నంబర్ 225–ఏ లో సుమారు 9.80 సెంట్ల ప్రభుత్వ రిజర్వు స్థలాన్ని కాజేసేలా కుట్ర చేశాడు. ఫోర్జరీ పట్టాలు సృష్టించాడు. మున్సిపల్ ప్రధాన కాలువపై సొంత ఖర్చులతో కల్వర్టు నిర్మాణం చేపట్టి, అసలైన మార్గాన్ని మూయించాడు. న్యాయస్థానాన్ని ఆశ్రయించి, దస్త్రాలు సిద్ధం చేసుకున్నాడు. అనేక ఏళ్లుగా ఈ పోరాటం సాగిస్తున్నా స్థానిక అధికారులు అడ్డుకుంటూ వచ్చారు. ఇటీవల రెవెన్యూ అధికారులు ఆ స్థలంలో ఓ బోర్డు ఏర్పాటు చేశారు. అయినా పట్టువీడడంలేదు. తాజాగా మళ్లీ స్థలాన్ని చదును చేస్తుండడంతో మున్సిపల్ పాలకులతో పాటు స్థానికులు తహసీల్దార్ కు ఫిర్యాదు చేశారు. కబ్జాదారుల చెర నుంచి స్థలాన్ని కాపాడాలని కోరారు. వారి ఫిర్యాదు మేరకు తహసీల్దార్ నాగరాజు అర్బన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కబ్జా చేస్తున్నట్టు ఆరోపణలు వెలువడే స్థలం ప్రభుత్వానిదా? లేక ప్రైవేట్ వ్యక్తులదా? అనే కోణంలో విచారణ జరిపి చర్యలకు ఆదేశిస్తామన్నారు.

బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు సన్మానం


బదిలీపై వెళ్తున్న ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం


అధికారులను సన్మానిస్తున్న దృశ్యం

కణేకల్లు: కణేకల్లు తహసీల్దార్ కార్యాలయంలో కొన్నేళ్ల నుంచి పనిచేస్తూ ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు తహసీల్దార్, సిబ్బంది మంగళవారం సన్మానించారు. బదిలీపై వెళ్లిన డిప్యూటీ తహసీల్దార్ రఘురామిరెడ్డి, మండల సర్వేయర్ రామ్మోహన్, సీనియర్ అసిస్టెంట్ గోవింద రెడ్డి, వీఆర్వోలు రమేష్, దామోదర్‌నాయుడు, ప్రభాకర్, రఘునాథ్, ప్రదీప్‌ను తహసీల్దార్ ఫణికుమార్, సిబ్బంది సన్మానించారు.

బ్రహ్మసముద్రం : ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేస్తూ.. ఇటీవలే బదిలీ అయిన అధికారులకు ఎంపీపీ కంబం చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఎంపీడీఓ దాసానాయక్ డీ హీరేహాళ్‌కు బదిలీ అయ్యారు. అనంతరం ఈఓఆర్డీగా పనిచేసి బదిలీల్లో భాగంగా అనంతపురం రూరల్ ఈఓఆర్డీగా బదిలీ అయిన వెంకట్‌నాయుడు, సీనియర్ అసిస్టెంట్ అచ్యుతానంద, పంచాయతీ కార్యదర్శులు సత్యమ్మ, మురళిని సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జిన్నామల్లి, బాధపల్లప్ప, మంజునాథ, గంగాధర, సర్పంచ్‌లు తలారి గోవిందప్ప, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కూడేరు: మండల పరిధిలోని కమ్మూరు వద్ద అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురానికి చెందిన నారాయణ స్వామి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. నారాయణ స్వామి ఉరవకొండలో పని ముగించుకొని ద్విచక్ర వాహనంపై అనంతపురం తిరిగి వెళ్తున్నాడు.ఘటనాస్థలంలో మొరాయించిన లారీ పక్కన పడి ఉన్న రాతిపై ద్విచక్రవాహనం ఎక్కించడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. క్షతగాత్రుడిని వాహనదారులు 108 వాహనంలో అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

బెళుగుప్ప పంచాయతీ సెక్రటరీగా శివరంజని

బెళుగుప్ప: బెళుగుప్ప గ్రామ పంచాయతీ సెక్రటరీగా శివరంజని మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న పంచాయతీ సెక్రటరీ వెంకటేశులు విడపనకల్లుకు బదిలీ అయ్యారు. కూడేరు మండలం ఉదిరిపికొండ పంచాయతీ సెక్రటరీగా శివరంజని ఇక్కడికి వచ్చారు.

కణేకల్లు వీఆర్వోగా కరణం పవన్‌కుమార్


కణేకల్లు: కణేకల్లు వీఆర్వోగా కరణం పవన్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ వీఆర్వోగా పని చేస్తున్న ప్రదీప్ బెలుగుప్పకు బదిలీ అయ్యారు. బెణికల్లు వీఆర్వో పవన్‌కుమార్‌ను కణేకల్లు వీఆర్వోగా నియమించారు.

42 మంది ఉద్యోగాలకు ఎంపిక

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ సమీపంలోని బోరంపల్లి వద్ద ఉన్న పాలటెక్నిక్ కళాశాలలో ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సీడాప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మంగళవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. వందమందికి పైగా నిరుద్యోగులు ఉద్యోగ మేళాలో పాల్గొన్నారు. 42 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వెంకటరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ కుమార్ తెలిపారు.

శమీ శత్రువినాసిని..నమోస్తుతే!


సంతానలక్ష్మీ అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి


రాయదుర్గంలో ధనలక్ష్మీ అలంకరణలో చౌడేశ్వరిదేవి


వజ్రకరూరులో శ్రీమహాలక్ష్మిగా దర్శనమిస్తున్న అమ్మవారు

రాయదుర్గంటౌన్: రాయదుర్గంలో నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆరోరోజు మంగళవారం పట్టణంలోని కోటలో వెలసిన నగరేశ్వరి, కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాత సంతానలక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. నేసేపేటలో వెలసిన చౌడేశ్వరిదేవి ధనలక్ష్మీ అలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. ఓబుళాచారి రోడ్డులోని బన్ని మహంకాళమ్మ ఆలయం, శాంతి నగర్‌లోని పెద్ద బన్ని మహంకాళి, హటకేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవి, కోటలోని కంసలవీధి వెలసిన కాళికాంబదేవి, లక్ష్మీబజార్‌లో వెలసిన శ్రీముదుగులమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని బొమ్మక్కపల్లిలో వెలసిన రాజరాజేశ్వరిదేవి ఆలయంలో పూజలు జరిపారు.


వజ్రకరూరు మారెమ్మ ఆలయంలో సరస్వతి దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు


కళ్యాణదుర్గంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహాలక్ష్మీ అలంకరణ

ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలు

కుందుర్పి: కుందుర్పి లక్ష్మీనృసింహ స్వామి ఆలయం, కోదండరామస్వామి ఆలయం, నాగేపల్లి యల్లమ్మ ఆలయం, బెస్తరపల్లి సవారమ్మ ఆలయం, కదరంపల్లి దుర్గాదేవి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు.

ధనలక్ష్మీ అలంకరణలో అమ్మవారు

గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెర వీరభద్ర స్వామి ఆలయంలో భద్రకాళీ అమ్మవారు ధనలక్ష్మీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన అమ్మవారు

వజ్రకరూరు: స్థానిక లలితాత్రిపుర సుందరీదేవి ఆలయంలో అమ్మవారు మంగళవారం శ్రీమహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు.

కణేకల్లు: కణేకల్లులోని దుర్గాదేవి ఆలయంలో మంగళవారం అమ్మవారు చాముండేశ్వరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కనకదుర్గ ఆలయంలో శాకాంబరీదేవిగా దర్శనమిచ్చారు.

వజ్రకరూరు: స్థానిక మారెమ్మ దేవాలయంలో సరస్వతిదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని కన్యాకపరమేశ్వరి ఆలయంలో నవరాత్రుల సందర్భంగా మంగళవారం మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు దర్శనంఇచ్చారు.

మహాలక్ష్మిగా ఉరగాద్రి చౌడేశ్వరి

ఉరవకొండ: దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా సిండికేట్ బ్యాంకు వద్ద వెలసిన ఉరగాద్రి చౌడేశ్వరి అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు మంగళవారం దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త కొత్తశరత్ ఆధ్వర్యంలో అమ్మవారి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గుంతకల్లు రోడ్డు వద్ద వెలసిన జగదీశ్వరి అమ్మవారు మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు.


కణేకల్లులో చాముండేశ్వరీ అవతారంలో అమ్మవారు


ధనలక్ష్మీ అవతారంలో దర్శనమిచ్చిన భద్రకాళి


ఉరవకొండలో మహాలక్ష్మి అలంకరణలో ఉరగాద్రి చౌడేశ్వరి

క్లుప్తంగా

పాపాన్ని వదిలి పరిశుద్ధంగా జీవించాలి


సువార్త ఉజ్జీవ సభలకు హాజరైన క్రైస్తవులు

కంబదూరు: మండల కేంద్రంలోని సీఎస్ఐజీ మిషన్ చర్చిలో రెండో రోజైన మంగళవారం రాత్రి కూడా సువార్త ఉజ్జీవ మహాసభలు నిర్వహించారు. ప్రసంగీకులుగా బెంగుళూరుకు చెందిన దైవ జనులు జోయెల్ ఎస్. బాబు క్రైస్తవ భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. పాపాన్ని వదిలి పరిశుద్ధంగా జీవిస్తూ పరలోకానికి వారసులు కావాలన్నారు. అనంతరం బైబిల్‌లోని ఆధ్యాత్మిక సందేశాన్ని బోధించారు. కార్యక్రమంలో పాస్టర్లు జేమ్స్, ప్రభుదాస్, ఆనంద్ రాజు, ఎజ్రా, గిద్యోన్, సంఘం పెద్దలు దినకర్, జాన్ శాస్త్రీ, పాల్, విజయకుమార్, జకరయ్య, జాకోబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములు పేదలకు పంచండి


తహసీల్దార్ మునివేలుకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

బొమ్మనహాళ్: మండలంలోని ఆలయ భూములను పేదలకు పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగార్జున, రైతు సంఘం నాయకులు తిప్పేస్వామి, నాయకులు కోట్రేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ మునివేలును కలిసి వినతిపత్రం అందించారు. మండలంలోని ఉద్దేహాళ్‌లో బళ్లారి రామస్వామి ఆలయానికి సంబంధించిన పలుకుబడిన ఆక్రమించుకున్నారని తెలిపారు. ఇదే గ్రామంలో మరో 20 ఎకరాలు ఆక్రమించుకున్నారని వినతిపత్రంలో తెలిపారు. లింగదహాళ్, కృష్ణాపురం, కొలగానహళ్లి తదితర గ్రామాలలో ఈశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల భూములు ధనికులే సాగు చేసుకుంటున్నారన్నారు.

వైభవంగా మారెమ్మ దేవత గ్రామోత్సవం


మారెమ్మ మూలవిరాట్

కూడేరు: కూడేరులోని పీర్ల మసీదు వద్ద ఉన్న మారెమ్మ దేవత గ్రామోత్సవం మంగళవారం జరుపుకున్నారు. తొలుత మారెమ్మ మూలవిరాట్‌కు పాలాభిషేకం చేసి, వివిధ రకాల పట్టు వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. సాయంత్రం మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల నోట మారెమ్మ అమ్మవారి నామస్మరణ మార్మోగింది. భక్తులకు అన్నదానం చేశారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తే చర్యలు


కుందుర్పి పోలీసులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ నీలకంఠేశ్వర్

కుందుర్పి: కర్ణాటక మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని కళ్యాణదుర్గం రూరల్ సీఐ నీలకంఠేశ్వర్ హెచ్చరించారు. మంగళవారం కుందుర్పి ఇన్‌చార్జ్ ఎస్ఐ రాంభూపాల్‌తో కలిసి మండంలోని వివిధ గ్రామాల్లో దాడులు నిర్వహించారు. అప్పిలేపల్లి గ్రామంలో కర్ణాటకకు చెందిన 60 టెట్రా ప్యాకెట్లను ఓవ్యక్తి నుంచి స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశామన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

- జిల్లా బాలల సంరక్షణ అధికారిణి ఎం.వెంకటేశ్వరి


ఆర్టీటీ హోంలో మాట్లాడుతున్న బాలల సంరక్షణ అధికారిణి వెంకటేశ్వరి

కణేకల్లు: చిన్నారులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.వెంకటేశ్వరి ఆర్డీటీ హోం స్కూల్ నిర్వాహకులకు సూచించారు. మంగళవారంకణేకల్లు క్రాస్‌లోని ఆర్డీటీ హోం స్కూల్‌ను జిల్లా బాలల సంరక్షణ అధికారిణి సందర్శించారు. పిల్లలు ఏ వేళలో నిద్రలేస్తారు? రోజువారీ కార్యకలాపాలు, పిల్లల విద్యాబోధన, ఆరోగ్య పరిస్థితులపై ఆమె ఆరా తీశారు. అనంతరం భోజన నాణ్యతను పరిశీలించారు. హోమ్ స్కూల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. సోషల్ వర్కర్ వసంతలక్ష్మి, హోం నిర్వాహకులు రాజశేఖర్, సిబ్బంది గోవిందప్ప, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి


కమ్మూరులో పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏఓ విజయకుమార్

కూడేరు: భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా పంట పెట్టుబడుల ఖర్చు తగ్గించుకోవచ్చని ఏఓ విజయకుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని కమ్మూరు, అరవకూరు గ్రామాల్లో వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రంగారెడ్డి, ఏఓ విజయ కుమార్, పట్టు శాఖ టీఓ శ్రీనివాసులు, వీఏఏ నగేష్, వీఏహెచ్ఏ రామాంజనేయులు, ఆర్డీటీ సిబ్బంది వజన, పద్మావతమ్మ, అభ్యుదయ రైతులు, రైతులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: రాయితీ పప్పుశనగ ధర క్వింటా రూ.7,050గా ప్రభుత్వం నిర్ణయించినట్లు ఏఓ మధుకర్ తెలిపారు. మంగళవారం గంజికుంట,తట్రకల్లు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు.పంటలసాగులో తీసుకోవాల్సిన మెలకువలు, మందుల పిచికారీ తదితర అంశాలపై వివరించారు. ఏఈఓ జానమ్మ,వీఏఏ కృపా, ఎంపీఈఓలు ప్రమీలా, రామకృష్ణనాయక్, రైతులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: నరసాపురం సచివాలయ పరిధిలో రైతులు సాగు చేసిన పంటలను ఏఓ పృథ్వీసాగర్ పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం పరిశీలించారు. సచివాలయ అధికారులు తిమ్మన్న, విజయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

వాల్మీకి సంఘం నాయకుడు ఓబుళపతి మృతి

కుందుర్పి: వాల్మీకి సంఘం మండల నాయకుడు రుద్రంపల్లి బోయ ఓబుళపతి (86) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. మండల వాల్మీకి ఉద్యోగ సంఘం నాయకులు బీసీ, తిమ్మప్ప, బొమ్మయ్య తదితరులు రుద్రంపల్లికి వెళ్లి ఓబుళపతి మృతదేహం వద్ద నివాళి అర్పించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

వజ్రకరూరు: మండలంలోని గడేహోతూరు గ్రామం వద్ద పేకాట స్థావరంపై వజ్రకరూరు పోలీసులు సోమవారం రాత్రి దాడి చేశారు. 12 మంది పేకాట రాయుళ్లను అరెస్టేచేసి, రూ.12,290 నగదు స్వాధీనం చేసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో మహాకుంభారాధన


అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు


అలంకరణలో బూదగవి గౌరసంద్ర మారెమ్మ

ఉరవకొండ: బూదగవిలో వెలసిన గౌరసంద్ర మారెమ్మ జలధి బిందె పూజలో భాగంగా గ్రామోత్సవం మంగళవారం నిర్వహించారు. ఉదయం అమ్మవారి అభిషేకం, మహా మంగళ హారతి, కుంకుమార్చన, దీక్షాహోమం నిర్వహించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో మహాకుంభాభిషేకాన్ని ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

గుమ్మఘట్ట: రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జీఎస్ఏ) కార్యాచరణ ప్రణాళిక 2024–25, సాధారణ కనీస పరిపాలన విధానంపై ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధ, గురువారం శిక్షణ ఉంటుందన్నారు.

ఈక్రాప్ నమోదు పరిశీలన


ఈక్రాప్ నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ సుమతి

బ్రహ్మసముద్రం: మండలంలోని పిల్లలపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారులు చేస్తున్న ఈ క్రాప్ నమోదును తహసీల్దార్ సుమతి మంగళవారం పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదును పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఆర్వో మర్రిస్వామిపాల్గొన్నారు.

అభాగ్యుడికి ఆర్థిక సాయం

కళ్యాణదుర్గం రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న బోరంపల్లికి చెందిన మహేంద్రకు ఇన్నినిటి ట్రస్టు ఆర్థికసాయం అందించింది. బాధితుడు లివర్ వ్యాధితో బాధపడుతున్నాడు. మెరుగైన వైద్యం చేయించుకునే స్తోమతలేక ఇబ్బంది పడుతున్నాడు. ట్రస్టు చైర్మన్ బద్దేనాయక్ రూ.12 వేలు అందించాడు.